క్లుప్తంగా

ఫోన్ నంబర్లను లింక్ చేయండి


డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట) : మహిళల బ్యాంక్ అకౌంట్లకు ఫోన్ నంబర్లను అనుసంధానం చేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అధికారులను ఆదేశించారు. నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి డివిజనల్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ శనివారం మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మూడున్నర లక్షలకుపైగా బ్యాంకు అకౌంట్లకు ఫోన్ నంబర్లను అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు లక్షకు పైగా అనుసంధానం ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన అనుసంధానం చేయాలని సూచించారు.

దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం) : మూలాపేట బ్రాహ్మణవీధిలోని వెంకయ్యస్వామి గురు నిలయంలో 5 వేల మందికిపైగా నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం వేలాది మందికి అన్నప్రసాద సంతర్పణ గావించారు. మాకాని గోపిచంద్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో హైకోర్టు అడ్వొకేట్ చంద్రబాబు, పారిశ్రామికవేత్త పెంచలయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వెంకయ్యస్వామి, వెంకట్రావ్‌ల విగ్రహాలకు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

సౌకర్యాల కల్పనకు కృషి


పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలో పేదల నివాస ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. 26వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంతల రోడ్లు, డ్రెయిన్ల విషయంలో శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో పేట ఉత్సవం



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్ వద్ద స్వర్ణలింగేశ్వర స్వామి దేవస్థాన జీర్ణోద్ధరణను పురస్కరించుకుని రెండో రోజు శనివారం స్వామివారికి, పరివార దేవతలకు హోమాలు, పేట ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం పునర్నిర్మాణ దాతలు స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్రావ్ దంపతులు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష, పి.సురేందర్‌రెడ్డి, హైమావతి, సుభద్ర, స్వరూప, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నెల్లూరు(క్రైమ్) : పుస్తక పఠనంతో మానసిక వికాసం కలుగుతుందని రంగనాయకులపేట గ్రంథాలయ అధికారి వి.అరుణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రంగనాయకులపేటలోని గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ పుస్తక పఠనం నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాల విశిష్టతను వివరించారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన


మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కమిషనర్ నందన్ సచివాలయాల వార్డు కార్యదర్శులకు సూచించారు. ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కార్యక్రమంలో భాగంగా నగదు రహిత లావాదేవీల అంశంపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

వీడని ముసురు


వీఆర్సీ సెంటర్‌లో కురుస్తున్న జోరు వర్షం


భారీ వర్షంలో బైక్‌పై అవస్థలు

అల్పపీడన ప్రభావంతో ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా శనివారం తెరపిస్తూ కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపు ఎండ పడడం వెంటనే భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. ప్రధాన రహదారుల్లో వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో మురుగునీరు కూడా కలిసి రొచ్చురొచ్చుగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నగరంలో కురుస్తున్న భారీ వర్షం


కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రధాన రహదారిపై వర్షపునీటిలో వెళ్తున్న వాహనాలు


వీఆర్సీ సెంటర్‌లో..

విద్యార్థులకు క్విజ్ పోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

నెల్లూరు (టౌన్) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సొసైటీ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(శాలీస్) ఆధ్వర్యంలో స్థానిక సుంకు చెంగన్న మున్సిపల్ స్కూల్లో విద్యార్థులకు క్విజ్‌తో పాటు పలురకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రమణారావు హాజరై, విద్యార్థులకు గ్రంథాలయాలు, వాటి ప్రాముఖ్యత, పుస్తక పఠనం ఆవశ్యకత తదితర అంశాలపై వివరించారు. జ్ఞాపకశక్తిని ఏ విధంగా పెంపొందించుకోవాలి, రెగ్యులర్ స్టడీస్‌లో దానిని ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో శాలీస్ నెల్లూరు చాప్టర్ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్, కార్యదర్శి విజయమహేష్, హెచ్‌ఎం అరవింద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

• ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్


మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు

నెల్లూరు(క్రైమ్) : ఎస్సీ, ఎస్టీ చట్టాలపై గిరిజనుల్లో అవగాహన పెంపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ సూచించారు. నగరంలోని అంబేడ్కర్ భవనంలో సీఐడీ పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, షెడ్యూల్డ్ ట్రైబల్ కమ్యూనిటీస్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్ శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వడిత్య శంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. అధిక శాతం గిరిజనులకు రేషన్, ఆధార్‌కార్డులు లేవని, ఫలితంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి వరకు చేరడం లేదన్నారు. అధికారులు స్పందించి స్పెషల్ డ్రైవ్‌లో వారికి రేషన్, ఆధార్‌కార్డులను అందజేయాలన్నారు. గిరిజనుల జీవన స్థితిగతుల మార్పునకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదని, ఈ విషయమై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, గిరిజన పిల్లలందరూ చదువుల్లో రాణించాలన్నారు. ఐటీడీఏ పీఓ టీబీకే పరిమల గిరిజనుల సంక్షేమానికి జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. సీఐడీ, నెల్లూరు నగర డీఎస్పీలు ఎస్.కోటారెడ్డి, డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఎస్సీ, ఎస్టీలను అవమానించినా, దాడి చేసినా చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు రూరల్ తహసీల్దార్ డి.లాజరస్, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.హజరత్తయ్య, న్యాయవాదులు విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలకు వినతి



ఇన్‌చార్జి ఆర్టీఓకు వినతిపత్రం అందజేత

నెల్లూరు (టౌన్) : జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని ఏఐఎస్‌బీ నాయకులు బాబీభగత్, అమృత్, చైతన్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్టీఓ బాల మురళీకృష్ణను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్తుకూరు వెళ్లే మార్గంలో మాదరాజుగూడూరు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల బస్సు ప్రమాదానికి గురైందన్నారు. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయన్నారు. పాఠశాలలు, కళాశాలల బస్సులపై నిత్యం తనిఖీలు నిర్వహించి కండిషన్‌లో లేని బస్సులు, లైసెన్స్ లేని డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అందించే సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎం సోలార్ విద్యుత్ పథకంపై వినియోగదారుల్లో అవగాహన పెంచాలని తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 1912, 1800 425 155333, 91333 31912 నంబర్ల ద్వారా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, పరందామయ్య, శ్రీధర్, రమేష్ చౌదరి, శ్రీనివాస్, బెనర్జీ, లక్ష్మీనారాయణ, డీఈఈ మునీంద్ర, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఉడ్ కాంప్లెక్స్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ, విక్రమ్‌నగర్, ఉడ్‌కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేత్రదానం


శేషయ్య(ఫైల్)

నెల్లూరు(అర్బన్) : విడవలూరు మండలం చౌకచర్ల గ్రామానికి చెందిన ఎల్లు శేషయ్య(43) శనివారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. విడవలూరుకు చెందిన మనసేవా సంస్థ సహకారంతో మృతుని కుటుంబ సభ్యులు అతని నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మోటివేటర్ బాలాజీలు మృతుని నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేసేందుకు 99595 89321, 93471 11033 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ కలెక్టర్ ఆనంద్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

• నెల్లూరు(క్రైమ్) : రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ శనివారం రాత్రి జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించుకున్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా


సమావేశంలో కార్మిక సంఘాల నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్‌లో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. చంద్ర రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈనెల 26వ తేదీన జిల్లా కలెక్టరేట్ నిరసన ధర్నా చేపట్టాలని తీర్మానం చేశారు. దీంతో పాటు కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని, సోమశిల హైలెవల్ కెనాల్, వెలుగొండ, సీతారామ్ సాగర్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో పాటు రాష్ట్రస్థాయిలో పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం, చేతి వృత్తిదారుల సంఘం, రైతు కూలీ సంఘం, సీపీఐ ఎంఎల్ పార్టీలకు చెందిన అజయ్ కుమార్, నాగేశ్వరరావు, షాన్‌వాజ్, రామరాజు, వెంకమరాజు, పుల్లయ్య, వెంకయ్య, శ్రీరాములు, గురునాథం, దయాకర్, వెంకటేశ్వర్లు, సునీత, రామ్‌బాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 128 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

నెల్లూరు (టౌన్) : నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో 128 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణారావు తెలిపారు. డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఉద్యోగ మేళాకు పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన 205 మంది హాజరైనట్లు చెప్పారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆయా కంపెనీల ప్రతినిధులు అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేశారన్నారు. ఈ జాబ్‌మేళాలో చెన్నై, శ్రీసిటీ, తడ తదితర ప్రాంతాలకు చెందిన ఏడు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జేకేసీ కో–ఆర్డినేటర్ వై.వెంకటేశ్వర్లు, మెంటార్ ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంఘ సభ్యత్వ నమోదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, ముత్తుకూరు గేట్, వీఆర్సీ సెంటర్, హరనాథపురం, స్టోన్‌హౌస్‌పేట, రైల్వేస్టేషన్, పూలే విగ్రహం సెంటర్‌లలో ఆటో కార్మిక సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నగర కార్యదర్శి మురళి, నాయకులు రాజా, బాబురావు, నివాస్, రవీంద్ర, రాజా, జమీర్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

‘కాస్ట్ ఆడిట్ రిపోర్ట్’పై సదస్సు


కాస్ట్ అకౌంటెంట్ విజయకుమార్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ‘కాస్ట్ ఆడిట్ రిపోర్ట్ సెమినార్’ను శనివారం నిర్వహించారు. జిల్లా స్థాయిలో నెల్లూరు చాప్టర్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు కాస్ట్ అకౌంటెంట్ కె.విజయకుమార్ హాజరై, మాట్లాడారు. కాస్ట్ ఆడిట్ రిపోర్ట్‌ను ఎలా తయారుచేయాలో వివరించారు. కార్యక్రమంలో రీజనల్ కౌన్సిల్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ సంస్థ వైస్ చైర్మన్ వై.శ్రీనివాసరావు, నెల్లూరు చాప్టర్ చైర్మన్ మాధవ రాకేష్, సెక్రటరీ రాజేష్‌బాబు, మెంబర్లు పాల్గొన్నారు. అనంతరం విజయకుమార్‌ను సన్మానించారు.

అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నెల్లూరు రూరల్ : మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చేందుకు ప్రభుత్వం జీఓ ఇవ్వాలని అంగన్‌వాడీ సంఘం నేతలు సుజాతమ్మ, రెహానా బేగం డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లలో హెల్పర్లు లేకపోవడం వల్ల పనిభారం పెరిగిందని, దానికి తగ్గట్లుగా వేతనం మాత్రం పెంచలేదన్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

మండల పూజోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని స్వామిఅయ్యప్ప దేవస్థానంలో 41 రోజుల మండల పూజోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. కేరళకు చెందిన వడకేడత్తు పెరుంబడప్పమన కేశవన్ నంబూద్రిపాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారణతో తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వివిధ కార్యక్రమాల ఉభయకర్తలుగా ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి–శైలజ, డాక్టర్ ఊటుకూరు సత్యనారాయణరెడ్డి–మాలిని, కిరణ్‌కుమార్‌జైన్– హేమలత, మహీధర్‌రెడ్డి–జ్యోతి, గంటా రమణయ్యనాయుడు– ప్రమీలమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను అయ్యప్పసేవా సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం



నెల్లూరు(బృందావనం) : బీవీనగర్‌లోని సాయిబాబా మందిరంలో భక్తి సేవాదళ్ ఆధ్వర్యంలో అరుణాచలేశ్వర మహాకార్తీక దీపోత్సవాన్ని శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి అరుణాచలేశ్వర మహాదీపం, లక్ష దీపార్చన కార్యక్రమాలను చేపట్టారు. తొలుత తిక్కన మహాకవి లలిత కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలూరు శిరోమణివర్మ– రమాదేవి దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహా కార్తీక దీపోత్సవం ప్రాధాన్యతను ఆలూరు శిరోమణి శర్మ వివరించారు. కార్యక్రమంలో భక్తి సేవాదళ్ కన్వీనర్లు మురళీ, శ్రీకంఠం మనోహర్, బీజేపీ నేత రమేష్, రాజేష్, సంపత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

• ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్) : ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్.అన్వర్‌బాషా విద్యార్థులకు సూచించారు. పప్పులవీధిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, రోడ్‌సేఫ్టీ, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు తదితరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల్లో ప్రధానంగా కొరియర్ పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్‌యాప్స్, హనీట్రాప్, డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలు అధికమయ్యాయన్నారు. స్మార్ట్‌ఫోన్లను మంచికి ఉపయోగించుకుంటే జీవితం సాఫీగా సాగి ఉన్నతంగా ఎదుగుతారన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే డయల్ 1930 లేదా సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలను వినియోగించుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర వేళల్లో 112కు కాల్‌చేస్తే పోలీసుల తక్షణ సాయం అందుతుందన్నారు. అనంతరం నూతన చట్టాల గురించి వివరించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ


మాట్లాడుతూ డీఈ మధు

నెల్లూరు (పొగతోట) : సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ డీఈ మధు అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈఓలు, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శనివారం డీఈ పాల్గొని, మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని తెలిపారు.